క్లుప్తంగా

మహాలక్ష్మి అమ్మవారి విగ్రహావిష్కరణ



విశేషాలంకరణలో మహాలక్ష్మి అమ్మవారు

నింద్ర: మండలంలోని కేఆర్ పాళెం గ్రామంలో ఆదివారం లక్ష్మి జయంతిని పురస్కరించుకుని ఆలయం వద్ద మహాలక్ష్మి అమ్మవారి విగ్రహం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. గ్రామంలో అమ్మవారికి విగ్రహం 11 అడుగుల విగ్రహం చూడడానికి పలు గ్రామాల నుంచి భక్తులు వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం టీటీడీ వారిచే హరికథా కాలక్షేపం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా గిరిప్రదక్షిణ వేడుకలు



పెనుమూరు వద్ద గిరిప్రదక్షిణగా వస్తున్న పులిగుంటేశ్వరుడు

పెనుమూరు(కార్వేటినగరం) : ఫాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకుని ముందు రోజు ఆదివారం పులిగుంటేశ్వరస్వామి గిరిప్రదక్షిణ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం స్వామివారిని పట్టు వస్త్ర, సుగంధ భరిత పుష్ప మాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం స్వామివారిని ప్రత్యేక వాహనంపై ప్రతిష్టించి అశేష జనవాహిన మధ్య స్వామివారిని పులిగుంటేశ్వస్వామి ఆలయం వద్ద నుంచి గుంటిపల్లి, కనికాపురం, కొత్తరోడ్డు, రాణావేణుగోపాలపురం, దొడ్లడెయిరీ, సీఎస్ అగ్రహారం మీదుగా మంగళ వాయిద్యాలు, మేళతాళాలు, కోలాటాలు, చెక్క భజనల నడుమ గిరిప్రదక్షిణ వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారికి కర్పూరహారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. గిరి ప్రదక్షిణ అనంతరం ఆలయానికి చేరుకున్న స్వామివారిని అర్చకులు వేద మంత్రాల నడుమ ఏకాంత సేవ నిర్వహించి పవళింపజేశారు. స్వామివారి గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులకు స్వామి వారు అనుగ్రహంతో పాటు ఒక మహత్తర అనుభూతి కలిగి, మానసిక ప్రశాంతత కలుగుతుందనేది ఇక్కడి భక్తుల విశ్వాసం.

వైభవంగా కల్యాణోత్సవం

నగరి : పట్టణ పరిధిలోని కామాక్షీ సమేత కరకంఠేశ్వర ఆలయంలో నిర్వహిస్తున్న పంగుణోత్తర కల్యాణోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉదయం మూలవర్లకు, ఉత్సవర్లకు అభిషేక అర్చనలు చేశారు. పౌర్ణమి తిథి, ఉత్తరా నక్షత్రం అమృతయోగం కూడిన శుభలగ్నంలో కామాక్షాంబ కరకంఠేశ్వర స్వామివారికి కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో మధ్యాహ్నం భక్తులకు కల్యాణోత్సవ విందు ఏర్పాటుచేశారు. రాత్రి స్వామి, అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. ప్రత్యేక అలంకరణలో ఊరేగింపుగా వచ్చిన స్వామివారికి కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులు ఇచ్చి భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మూర్తిస్వామి కన్నుమూత



మూర్తిస్వామి (ఫైల్)

పుత్తూరు: పట్టణానికి చెందిన ప్రముఖులు ప్రకాశ మూర్తి శివాచార్యులు(58) ఆదివారం సాయంత్రం పరమపదించారు. వేలూరుకు పనిమీద వెళ్లిన ఆయన అక్కడే మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. కాగా ఆయన పుత్తూరు అయ్యప్పస్వామి ఆలయ ప్రధాన గురుస్వామిగా సేవలందించారు. ఆయన మృతి పట్ల స్థానిక గాయత్రీదేవి బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య అధ్యక్షుడు సి.రమేష్ పురోహితులు సంతాపం తెలిపారు.

మానవత్వం చాటుకున్న ఎస్ఐ భారతి

పాలసముద్రం : పోలీసు స్టేషన్‌లో అస్వస్థతకు గురైన యువకున్ని సమయానికి వైద్య పరీక్షలు చేయించి ఎస్ఐ భారతి మానవత్వం చాటుకున్నారు. ఆదివారం మండలంలోని స్థానిక దళితవాడకు చెందిన మేజర్ అమ్మాయి అదృశ్యం కావడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అనుమానితుడిగా అదే గ్రామానికి చెందిన యువకున్ని అదుపులోకి తీసుకున్నారు. యువకుడు సరైన సమయానికి మాత్రలు తీసుకోకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే ఎస్ఐ భారతి తమ బృందంతో తమిళనాడు షోళింగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. యువకుడు కోలుకోవడంతో అతని తల్లిదండ్రులకు అప్పగించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

- చదువుతో పాటు క్రీడలు కూడా అవసరమే..!
- దేశంలో 90 శాతం మంది క్రీడాకారులు గ్రామస్థాయి నుంచి వచ్చిన వారే..
- గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికే ఆడుదాం ఆంధ్రా
- మంత్రి ఆర్‌కే రోజా



విజేతగా నిలిచిన మంగళం జట్టుకు బహుమతి అందజేస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

విజయపురం : చదువు విజ్ఞానాన్ని ఇస్తే, క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని, ప్రస్తుతం ప్రపంచ దేశంలో రాణిస్తున్న 90శాతం మంది క్రీడాకారులు గ్రామస్థాయి నుంచి వచ్చిన వారేనని మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. గత ఏడాది డిసెంబర్ 25వ తేదీన ప్రారంభమైన క్రికెట్ టోర్నమెంట్ నాలుగు నెలల పాటు జరిగి ఆదివారం ముగిసింది. ఇందులో తమిళనాడు, ఆంధ్ర సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న 30 జట్లు పాల్గొన్నాయి. వాటిలో తిరుత్తణి, మంగళం జట్లు ఫైనల్‌కు చేరాయి. ఆదివారం జరిగిన తుది మ్యాచ్‌లో మంగళం జట్టు విజేతగా నిలిచింది. వీరికి మంత్రి ఆర్కే రోజా చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి రూ.30 వేలు (మంత్రి ఆర్కే రోజా) రెండో బహుమతి రూ. 20 (ప్రసన్న, రాజాదాస్), అందించగా విజయపురం సర్పంచ్ మురళీధర్‌రెడ్డి రూ.5 వేలు అందించారు.

చదువుతో పాటు క్రీడలూ అవసరమే..

అనంతరం మంత్రి ఆర్‌కే రోజా మాట్లాడుతూ ఒక వ్యక్తికి చదువు ఎంత ముఖ్యమో, క్రీడలు కూడా అంతే ముఖ్యమని, అందుకే సీఎం జగనన్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. తమిళనాడు తనకు అత్తగారి ఇల్లు అయితే.. ఆంధ్ర తనకు పుట్టినిల్లు అని అన్నారు. తాను సినిమాల్లో ఉన్నప్పుడు అటు తమిళనాడు, ఇటు ఆంధ్రలో సినిమాలను బ్యాలెన్స్ చేస్తూ నటించినట్లు గుర్తు చేశారు.

గ్రామస్థాయిలో ఆణిముత్యాలు

నైపుణ్యం కలిగిన క్రీడకారులు గ్రామస్థాయిలో చాలా మంది ఉన్నారని, వారికి సరైన శిక్షణ లేక పోవడంతో ప్రతిభను వెలుగులోకి తీసుకురాలేక పోతున్నారని మంత్రి రోజా అన్నారు. అలా వారిలోని ప్రతిభను వెలికి తీసేందుకు రాష్ట్రప్రభుత్వం రూ.110 కోట్లు ఖర్చు చేసి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. అందులో ప్రతి గ్రామస్థాయి క్రీడాకారుడు కూడా తమ ప్రతిభను జిల్లా, రాష్ట్రస్థాయిలో చూపించారని గుర్తు చేశారు. అంతేగాకుండా ప్రతి మండల, పట్టణ, నియోజకవర్గ, జిల్లాస్థాయిలో క్రీడామైదానం ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాలాజీ, ఆర్‌బీకే చైర్మన్ గుణశేఖర్ రెడ్డి, పాండియన్, గోపిరాజ్, సుధాకర్‌రాజు, మురళీరెడ్డి, దశరథరాజు, ప్రభుదాస్, అప్పున్, జాకీ, మనో, అంబేడ్కర్, యోహాన్, రాజశేఖర్, చిన్నరాజు, రాజేష్, సర్పంచ్ జబమేరీ, శాంతి, తదితరులు పాల్గొన్నారు.

పంగుణోత్తర పూజల్లో మంత్రి రోజా



ఆలయ పూజల్లో మంత్రి రోజా దంపతులు

నగరి : మున్సిపల్ పరిధిలోని సత్రవాడ అయ్యప్ప ఆలయంలో ఆదివారం పంగుణోత్తర పూజలు, అయ్యప్ప స్వామి జన్మనక్షత్ర పూజలు వైభవంగా నిర్వహించారు. మంత్రి ఆర్కేరోజా, ఆమె భర్త రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి ఈ వేడుకలకు హాజరై ఆలయంలో భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చనలు చేయించుకున్న అనంతరం ఆలయ ఆవరణలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు భోజనం వడ్డించారు. వారి వెంట స్థానికులు బాలకృష్ణ, బీఆర్వీ అయ్యప్పన్, కన్నాయిరం, అయ్యప్ప, జగన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి ముస్లిం నేతలు



ముస్లిం నేతలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి రోజా

పుత్తూరు: మున్సిపాలిటీ పరిధిలోని భవానీనగర్‌కు చెందిన ముస్లిం నేతలు ఆదివారం పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. నగరిలోని పార్టీ కార్యాలయంలో భవానీనగర్ మసీదు అధ్యక్షుడు షరీఫ్‌బాయ్, టీడీపీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.మస్తాన్, ముస్లిం పెద్దలు నస్రుల్లా, అబ్బాస్, సైపుల్లా, జిక్రియాలకు మంత్రి కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ టీడీపీ నేత మస్తాన్‌కు వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీలో సముచిత స్థానం కల్పిస్తామని ప్రకటించారు. మైనారిటీ ఫైనాన్స్ డైరెక్టర్ మాహీన్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో సీఎం జగనన్న ఐదుగురు ముస్లింలకు అవకాశం కల్పించారని, ఒకరిని ఉప ముఖ్యమంత్రిగా, ఇద్దరు ఎమ్మెల్సీలుగా, మరొకరిని శాసనమండలి ఉపాధ్యక్షుడిగా పదవులు ఇచ్చి గౌరవించారని గుర్తు చేశారు. ప్రస్తుత ఎన్నికల్లోనూ జగనన్న ఏడుగురు మైనారిటీలకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. మంత్రి రోజమ్మ సహకారంతో పుత్తూరులో షాదీమహల్‌ను ఏర్పాటు చేసుకోగలిగామని ముస్లిం పెద్దలు చెప్పారు. నగరిలో ముస్లిం గ్రామాన్నే దత్తతకు తీసుకుని అభివృద్ధి చేసినట్లు తెలిపారు. రోజమ్మ సేవలకు ప్రతిఫలంగా ఎన్నికల్లో ఆమెను గెలిపించుకుంటామని చెప్పారు.

కుంభాభిషేక వేడుకల్లో మంత్రి రోజా



నగరి : మున్సిపల్ పరిధిలోని కీళపట్టులో నూతనంగా నిర్మించిన పట్టాభిరామ ఆలయ కుంభాభిషేక వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి ఆలయం వద్ద హోమపూజలు నిర్వహించారు. మంత్రి ఆర్‌కే రోజా కుంభాభిషేక పూజలకు హాజరై హోమ పూజలు, పూర్ణాహుతి, కుంభకలశ ఊరేగింపు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కుంభాభి షేకం అనంతరం స్వామివార్లకు మహాభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించగా మంత్రి దర్శించుకుని కర్పూర హారతులు స్వీకరించారు. వేద పండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పూర్ణాహుతి పూజల్లో పాల్గొన్న మంత్రి ఆర్‌కే రోజా

వైఎస్సార్‌సీపీ గెలుపు చారిత్రక అవసరం



ఓట్లు అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత రామ్‌ప్రసాద్‌రెడ్డి

- వైఎస్సార్‌సీపీ నేత రామ్‌ప్రసాద్‌రెడ్డి

పుత్తూరు: అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపు చారిత్రక అవసరమని వైఎస్సార్‌సీపీ నేత వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి అన్నారు. సంక్షేమ పథకాల అమలుతో పాటు అభివృద్ధి కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిందేనని ఇందుకు ప్రతి ఓటరు తమవంతు కృషి చేయాలని కోరారు. ఆదివారం ఆయన వడమాలపేట మండలం ఓబీఆర్ కండ్రిగ పంచాయతీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గత ఐదేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, జరిగిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ ఫలాలు అందుకున్న ప్రతి కుటుంబం మరోమారు ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటులో భాగస్వాములు కావాలని కోరారు. మంత్రి రోజమ్మ నేతృత్వంలో వడమాలపేట మండలంలో అనేక అభివృద్ధి పనులు జరిగినట్లు తెలిపారు. నగరి నియోజకవర్గంలో అడిగిన ప్రతి పనిని ముఖ్యమంత్రి మంజూరు చేశారని చెప్పారు. ప్రత్యేకించి మహిళల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. మనసున్న ముఖ్యమంత్రి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, ఇందుకు ప్రతి మహిళా సహకరించాలని కోరారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ప్రతిపక్ష తెలుగుదేశం నాయకులు మోసపూరిత వాగ్దానాలను గుప్పిస్తున్నారని చెప్పారు. ఇందుకు పచ్చమీడియా పనికట్టుకుని ప్రచారం చేస్తోందని ఆరోపించారు. గతంలో తాము చేసిన మంచిని చెప్పి ఓట్లు అడిగే స్థితిలో టీడీపీ లేదని, అందకే అసత్య ప్రచారాలతో ప్రజల ముందుకు వస్తోందని ఆరోపించారు. 14 ఏళ్ల తన పాలనలో మంచి చేయలేని చంద్రబాబు, నేడు ఎలా చేస్తారో చెప్పాలని వారిని ప్రజలే ప్రశ్నించాలని కోరారు. జగనన్న సైనికురాలిగా, మీ ఇంటి ఆడపడుచుగా అహర్నిశలు ప్రజాక్షేమం కోసం పనిచేస్తున్న మంత్రి రోజమ్మను నగరి ఎమ్మెల్యేగా రోజాను మరోమారు గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీవిద్య, రమేష్‌రాజు, అరుణ్, దీన, కమల, అంజమ్మ, రమేష్, యాదవేంద్రరెడ్డి, నందయ్య, సురేష్ రాజు, ఉమాపతి, వెంకట్‌రెడ్డి, లోకేష్, సుధీర్‌రెడ్డి, కిరణ్, మదన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బలగాల కవాతు



జీడీ నెల్లూరులో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు



పాలసముద్రం : వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఈబీ ఏఎస్పీ సుబ్బరాజు

గంగాధర నెల్లూరు: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరగాలని ముందస్తు హెచ్చరికలపై ఆదివారం కేంద్ర బలగాలు కవాతు నిర్వహించారు. మండల కేంద్రం లోని జీడీ నెల్లూరు మెయిన్ రోడ్డు, కాలేపల్లి, తూగుండ్రం, యస్‌యస్ కొండ గ్రామాల్లో గంగాధర నెల్లూరు పోలీసుల ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు, జీడీ నెల్లూరు సీఐ శంకర్ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని సూచించారు. గ్రామాల్లో ఎలాంటి అల్లర్లు అసాంఘిక కార్యక్రమాలు తావివ్వకూడదన్నారు. ఎన్నికల్లో కూడా అమల్లో ఉన్నందున ప్రతి ఒక్కరూ నియమావళి పాటించాలని సూచించారు. ఎన్నికల నియమాలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓటర్లను ప్రలోభపెట్టిన బెదిరించినా, పరోక్షంగా ఇబ్బందులకు గురిచేసినట్లు తెలిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం : ప్రశాంత వాతావరణంలో ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు తెలిపారు. ఆదివారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బలిజ కండ్రిగలో ఎన్నికల నిబంధనలు, ఓటు హక్కు వినియోగంపై ఎస్ఐ భారతి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలంతా ధైర్యంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం ఆయన సిబ్బందితో కలిసి సరిహద్దులో వాహన తనిఖీ చేశారు.

శ్రీకృష్ణుడికి పౌర్ణమి హారతులు

పుత్తూరు: పట్టణంలోని శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని గీతా మందిరంలో వెలసిన శ్రీకృష్ణ పరమాత్మకు శుక్రవారం పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం గీతా పారాయణం, భజనలు నిర్వహించారు. మహిళలు శ్రీకృష్ణ భగవానుడికి పౌర్ణమి హారతులిచ్చారు. అనంతరం ఉత్సవ మూర్తిని ఊయలలో పరుండబెట్టి ''జోఅచ్యుతానంద జోజోముకుందా.. లాలి పరమానంద రామ గోవిందా జోజో..'' గీతాన్ని ఆలపిస్తూ స్వామిని పవళింపజేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.



గీతా మందిరంలో మహిళల పౌర్ణమి హారతులు

భక్తిశ్రద్ధలతో క్రీస్తు శిలువ యాత్ర



శిలువ యాత్ర నిర్వహిస్తున్న క్రైస్తవులు

నగరి : పట్టణంలో గుడ్ ఫ్రైడే పవిత్ర శుక్రవార కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో శిలువ యాత్రను నిర్వహించారు. నగరి వెస్ట్ పాస్టరేట్ ఆధ్వర్యంలో శిలువ యాత్ర ఘట్టాలను ప్రదర్శిస్తూ నగరి పుర వీధుల్లో నిర్వహించిన శిలువ యాత్రలో వేలాదిగా క్రైస్తవులు పాల్గొన్నారు. నగరి పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా సాగింది. యాత్రలో పెద్దసంఖ్యలో పాల్గొన్న విశ్వాసకులు దారి పొడవునా క్రీస్తును స్తుతిస్తూ, కీర్తనలు ఆలపిస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రపంచంలోని క్రైస్తవులకు నేడు ఎంతో పవిత్రమైన రోజు అని నగరి వెస్ట్ పాస్టరేట్ పాస్టర్ రెవరెండ్ వినయ్‌కుమార్ అన్నారు. నశించిపోతున్న మానవాళి సంరక్షణకు లోక రక్షకుడైన క్రీస్తు దేవుడు శ్రమలను అనుభవించి, తన ప్రాణాలను సైతం త్యాగం చేశారన్నారు. సర్వ మానవాళి క్రీస్తు చూపిన మార్గాలను అనుసరించాలని పాస్టరేట్ సెక్రటరీ సత్యమూర్తి, ట్రెజరర్ సత్యబాబు సూచించారు.

108 లీటర్ల పాలతో క్షీరాభిషేకం



108 పాల కలశాలను తీసుకొస్తున్న చెన్నైకి చెందిన భాస్కర్ కుటుంబ సభ్యులు



లక్ష్మీనారాయణుడికి హారతి ఇస్తున్న అర్చకులు

గంగాధర నెల్లూరు: మండలంలోని వేపంజేరి గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీ నారాయణస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు 108 లీటర్లతో క్షీరాభిషేకం నిర్వహించారు. ఆలయంలో ఆదివారం ఉదయం మొదటగా స్వామి, అమ్మవారిని సుప్రభాత సేవతో మేలుకొల్పి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ గడపగుడిలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనారాయణ విగ్రహాలకు చెన్నైకి చెందిన భాస్కర్ కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. వారు తెచ్చిన కలశ కుండలతో 108 లీటర్ల పాలను తీసుకుని రాగా, అర్చకులు వేదమంత్రాలు మంగళ వాయిద్యాలు నడుమ క్షీరాభిషేకం వైభవంగా నిర్వహించారు. అదేవిధంగా శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ నారాయణ స్వామి కల్యాణోత్సవం చిత్తూరు నగరానికి చెందిన సంగీత, వేపంజేరి గ్రామానికి చెందిన పుష్ప చంద్రశేఖర్ రెడ్డి దంపతులు ఉభయదారులుగా నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం అన్నమాచార్య ప్రాజెక్టుకు చెందిన భాగవతారిణి కౌసల్య హరికథా కాలక్షేపం చేయగా అన్నమయ్య కీర్తనలు వేంకటేశ్వర భక్తి గీతాలను లక్ష్మీరాజ్యం ఆలపించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ నల్ల వెంకటేశ్వర్ రెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

ఘనంగా మట్టల పండుగ

కార్వేటినగరం: స్థానిక బీసీ కాలనీలోని బేతేల్‌షారోన్ చర్చిలో పాస్టర్ ఆశీర్వాదం ఆధ్వర్యంలో క్రైస్తవులు ఆదివారం మట్టల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన చిన్నారులు వివిధ రకాల పూలతో అలంకరించిన ఈత మట్టలను చేతపట్టి ప్రభువు కీర్తనలను ఆలపించారు. అనంతరం చర్చికి చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ఈ సందర్భంగా పాస్టర్ ఆశీర్వాదం క్రీస్తు సందేశాలను వివరించారు. అనంతరం చర్చి ఆవరణలో 500 మందికి అన్నదానం చేపట్టారు. అదేవిధంగా కార్వేటినగరంలోని యెహోవా ఈరే చర్చిలో కూడా పాస్టర్ అగస్టీన్ సరోజినీ ఆధ్వర్యంలో మట్టల ఆదివారం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో పాస్టర్లు బాబు,హరిబాబు, క్రిస్టియన్లు పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజమే లక్ష్యం

- ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీలు
- క్రమం తప్పకుండా మందులు వాడితే వ్యాధి నియంత్రణ
- అవగాహన కల్పించిన వైద్యసిబ్బంది

కార్వేటినగరం: క్షయ రహిత సమాజానికి ప్రతిఒక్కరూ సహకరించాలని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ హేమశ్రీ అన్నారు. జాతీయ క్షయ నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కత్తెరపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీబీ ఓడి పోతుంది.. దేశం గెలుస్తోంది, టీబీ అంతం మనందరి పంతం అన్న నినాదంతో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రెండు వారాలకు పైగా దగ్గు, జ్వరం, రాత్రి పూట చమటలు పట్టడం, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం వంటి లక్షణాలు ఉన్నవారు వెంటనే సమీపంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యాధికారులను సంప్రదించాలన్నారు. టీబీ నివారణకు ప్రభుత్వం ఉచితంగా మందులు అందిస్తోందని, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రాజేశ్వరి, పీహెచ్ఎన్ గౌరీ, పర్యవేక్షకులు త్యాగు, చంద్రవల్లి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

క్షయ వ్యాధిని జయించవచ్చు

పుత్తూరు: వైద్యుల సలహాల మేరకు పూర్తి కాలం మందులు వాడితే క్షయ వ్యాధి నుంచి విముక్తి పొందవచ్చని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ కృష్ణకాంత్ తెలిపారు. ఆదివారం ప్రపంచ క్షయ నివారణా దినోత్సవం సందర్భంగా పట్టణంలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు వస్తూ, బరువు తగ్గిపోతుంటే ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా క్షయ నిర్ధారణ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. స్థానిక ఆస్పత్రిలో ఉన్న ఆర్టీపీసీ మెషిన్ ద్వారా ఉచితంగా గళ్ల పరీక్ష చేయించుకుని క్షయ నిర్ధారణ అయితే ఉచితంగా మందులు పొందవచ్చని తెలిపారు. ఈ మందులను ఆరు నెలల పాటు క్రమం తప్పకుండా వాడడం ద్వారా క్షయను జయించవచ్చని వివరించారు. క్షయ వ్యాధి సోకిన రోగికి పోషకాహారం నిమిత్తం ప్రభుత్వం క్షయ పోషణ యోజన పథకం ద్వారా ప్రతి నెలా రూ.500 ఇస్తుందని తెలిపారు. ఇళ్లలోకి గాలి, వెలుతురు వచ్చే విధంగా అమర్చుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా రోగాలను నియంత్రించవచ్చని తెలిపారు. అనంతరం 'అవును మనం టీబీని అంతం చేయవచ్చు' అనే నినాదాలు, ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నగరి స్టెప్స్ ప్రివెన్షన్ సేవా సిబ్బంది, టీబీ సూపర్ వైజర్ తిరుమలయ్య, నవీన్, క్షయ యూనిట్ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నగరిలో..

నగరి : క్షయవ్యాధి నివారణ సామాజిక బాధ్యత అని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి అన్నారు. ఆదివారం ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా నగరి ప్రాంతీయ వైద్యశాల వద్ద అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీబీ పేషెంట్లు పోషకాహారం తీసుకునేలా నెలకు రూ.500 వారి బ్యాంకు ఖాతాకు జమ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ కార్తికేయన్, టీబీ యూనిట్ స్టాఫ్ పవన్, టీబీహెచ్‌వీ ప్రేమ రమేష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.







నగరిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది, కార్వేటినగరం : క్షయ నివారణపై అవగాహన ర్యాలీ చేపడుతున్న వైద్యాధికారులు, పుత్తూరులో..